
# శ్రావణపట్టీ



ఆకాశమంతటా శ్రావణమేఘాలు దట్టంగా అలముకొన్నాయి. అప్పుడప్పుడు తొలకరి మెరుపులు కళ్లు జిగేలుమనేట్లు మెరుస్తున్నాయి. అప్పుడే ప్రక్కయింటి వారి ఇందిరకు శ్రావణ పట్టీ తెచ్చారనీ చూడటానికి రమ్మని పిలుపువచ్చింది శ్యామలకు. ఆ పిలుపే, శ్యామల మరచిపో ప్రయత్నిస్తున్న శ్రావణపట్టీ ఘట్టాన్ని మళ్ళీ గుర్తుకు తెచ్చింది.

అసలు ప్రతి ఏడూ జరిగేది అదే. చేడెల ఆశలు చిగురించే శ్రావణమాసం, క్రొత్తగా వచ్చేవియ్యాలవారికోసం తల్లిదండ్రుల సన్నాహము, వారు తెచ్చే శ్రావణపట్టీని

బి. ఎస్. లక్ష్మి

(పెడన)

తల్పుకు అమ్మాయిలు పడే హడావిడీ యివన్నీ కలసి ఆలోచనల మేఘాలావరించి అనుకోకుండా గతాన్ని గుర్తుకు తెస్తాయి.

పెండ్లి అయిన తొలియేటి శ్రావణమాసము తెలుగునెలతల మనస్సులో ఆశలు రేపటము సహజము. ఎందుకంటే ఆ మాసంలో వచ్చే వరలక్ష్మి వ్రతమునాటికి క్రొత్తకోడలికి అత్తవారు యథాశక్తి కానుకలిచ్చి సంతోష పెట్టడము తెనుగునాట అనాదినించి వచ్చే ఆచారము. కాగా నూతన వధువులు ఎప్పుడు శ్రావణమాసము వస్తుందా, వరలక్ష్మిపూజ చేసి అత్తవారిచ్చే క్రొత్తకానుకలు ఎప్పుడు ధరిద్దామా అనే ఆత్రంతో ఎదురు చూస్తుంటారు. ఈ క్రొత్తకోడలు ఆశలు తీరటము తీరకపోవటము అనేది అత్తవారిమీద ఆధారపడివుంటుంది. కోరికలు తీరిన క్రొత్తకోడలు మనస్సులలో తొలకరి మెరుపు సృష్టించి, తీరని కోరికలు మాత్రమే మిగిలిన శ్యామలలాంటి వనితల మనస్సులో శ్రావణ మేఘాలు మాత్రమే సృష్టిస్తుంది శ్రావణమాసం.

ఆ సంవత్సరము శ్యామలకూడా అందరిలాగే శ్రావణలక్ష్మి ఆగమనము కోసము ఎదురుతెన్నులు చూసింది. ఆ క్రిందటి సంవత్సరమే తన అక్క సరస్వతి అత్తవారు శ్రావణపట్టీగా మావిడిపిందెల మాల తెచ్చారు. దాన్ని తను పట్టి పట్టి చూస్తూంటే, "నీకే యేటికి మీఅత్తవారూ తెస్తారులే. చిన్నకోడలా," అని అక్క అత్తగారు మేలమాడింది. అప్పట్లో ఆమాటలకు తను సిగ్గుపడ్డా పెళ్లయిన మరునాటి నుంచి తన మనస్సంతా శ్రావణ పట్టీ మీదే వుండిపోయింది. తన పెళ్లయి అత్త వారింటికి వెళ్ళినప్పుడు ఏదో మాటల సందర్భంలో తోడికోడలు శారద శ్రావణపట్టీగా యిచ్చిన పెద్ద కాసూ, కంచిపట్టు చీరచూపిస్తే తనకు కూడా శ్రావణ పట్టీ అలాగే తెచ్చినట్లయితే ఆ కాసుతో వల్లపూసలు చుట్టించుకోవచ్చని అప్పటి కప్పుడు చక్కని వూహాలల్లుకుంది.

అయితే ఏమి తనుకన్న కలలన్నీ కల్లలే అయ్యాయి. ఆ మాటంటే వారు, ఎప్పుడో అప్పుడు నీకు ముట్టేది ముట్టింది కదా! ఇంకేమి కొరత అంటారు. ఏమిటో ఈ పట్టింపులు మగవాళ్లకుండవేమో! తనకు మాత్రము ఏ ముచ్చట కా ముచ్చటే తీరాలనిపిస్తుంది.

"శ్రావణ మాసము నోములు నోపిస్తున్నాము మీ కోడలు చేత, వరలక్ష్మి వ్రతానికి రావలసింద"ని నాన్న వుత్తరము వ్రాస్తే తన అత్తవారు జవాబైనా యివ్వలేదు. ప్రయాణ సన్నాహము మీద వుండబట్టే సమాధానం వ్రాయలేదని సరిపెట్టుకు ప్రతి బండికి ఎదురు చూసింది తను. ఆనాడు అమ్మ పూజ చేసుకునేందుకు రమ్మని పిల్చినప్పుడుకూడా మనస్సులో ఆశ

దాపక ఇంకొంచెము సేపు వాళ్ళొస్తారేమో చూడకూడదా? అప్పుడే పూజ కోసము ఇంత తొందరపడాలా అని విసుక్కుంది తను. చివరకు అమ్మ బలవంతాన్న పూజ అయిందనిపించి విస్తరి ముందు కూడా అల్లాగే కూర్చుని లేచి మొక్కు చెల్లించుకుంది. ఒక్క మెతుకైనా ముట్టుకోలేదని అమ్మకోప్పడుతుండగానే తను చెయ్యి కడుక్కు వాకిట్లోకి వచ్చేసరికి పోష్టుమేన్ ఉత్తరము తెచ్చాడు.

అది తన తవారి వూరినుంచే వచ్చింది. తమ యింట్లో శ్రావణపట్టె ఆనవాయితీ లేదంటూ వ్రాసిన మామగారి ఉత్తరము చూడగానే ఆశ్చర్యము దుఃఖము ఒక్కసారి చుట్టివేశాయి తనని.

తన తోడికోడలికి జరిపిన శ్రావణపటి తనదగర కొచ్చేసరికి ఆనవాయితీ లేనిదయిందా? పెల్లుబుకివచ్చే దుఃఖాన్ని చూసి అమ్మా నాన్నా ఏమనుకుంటారో అని తను గదిలోకి పోయి మంచంమీద వాలిపోయింది. వాకిట్లోంచి అమ్మా నాన్నగారి మాటలు వినుపిస్తున్నాయి.

'శ్రావణపట్టీ వారియింట ఆచారము లేక మానేశారల్లే వుంది. పాపం అమ్మాయి చిన్నబుచ్చుకున్నట్లుంది' అంటున్నారు నాన్నగారు.

పెద్దకోడలికి జరిపిన శ్రావణపట్టి చిన్నకోడలిక ఆనవాయితీ లేదంటె బుద్ధితెలిసిన పిల్ల దానికి కష్టమెయ్యదూ? అయినా వారు ఆషాఢపట్టి పంపలేదనే అక్కసు కొద్దీ వారు కోడలికి తెచ్చే శ్రావణపట్టీ మానుకున్నారు. అంతే గాని ఆనవాయితీ లేక కాదు. అయితే మనమేమీవున్న ఆచారాన్ని లేవని బుకాయించ లేదుగా' అంటోంది అమ్మ.

అప్పుడు జ్ఞాపకమొచ్చింది తనకు. వారికి ఆషాఢపట్టీ పంపలేదనే సంగతి. అయితే తన బావకే పంపలేదు మరి ఆషాఢపట్టీ అమ్మా వాళ్ళూను. అయినా అక్క అత్తారు అక్కకు శ్రావణపట్టీ తెచ్చారు. వాళ్ళకు తన అత్తారికి మల్లె సాధిద్దామనే పటుదల లేదల్లే వుంది, కనుకనే అక్క సర్దాతీరింది. ఇల్లా అనుకుంటూనే తను నిద్రపోయింది.

అమ్మవచ్చి, 'శుక్రవారప్పూట కలకలలాడుతూ వుండాల్సిన యిల్లు ఎల్లావుందో అమ్మా, నీకీ నిద్రకూడా ఏమిటి. లేచి మొహంకడుక్కుని మీ నాన్నగారు తెచ్చిన కొత్తచీర కట్టుకో. ఎవరి అక్కసులు వారికే వుంటాయిలే,' అని లేపేవరకు తనకు మెలకువరాలేదు. ఏదో అమ్మ బలవంతముమీద కొత్తచీర కట్టుకున్నదన్న మాటే కానీ ఏదో తీరని వ్యథ మనసును వేధిస్తూండగా ఏదో తప్పుచేసిన దానిలా బయటికే పోలేదు ఆరోజంతా, ఎన్నో రోజులనుంచి తన మనస్సులో కోరికలూరించిన శ్రావణమాసం చివరకు తీరని కోరికను మాత్రము వదలి మెల్లగా జారుకొంది.

తనను తీసుకు వెళ్ళేందుకు వారు వస్తున్నట్లు ఆరోజే ఉత్తరము వచ్చింది. వారు రాగానే ఎన్నెన్నో అడిగి తనమనసులో ఆ వేదనంతా బయట పెట్టాలనుకుంది. తీరా, "శ్యామా!" అన్న వారిపిలుపు చెవిని పడగానే పట్టుదలంతా సడలిపోయి నాగస్వరంవిన్న నాగుబాములా మనస్సు ఆనందంతో పరవళ్ళు త్రొక్కింది.

దానితో, పెద్దవాళ్ళు పంపనిదానికి పాపం. వారేమి చేస్తారని సరిపెట్టుకుందితను,

ఆ రాత్రి వారు మాట్లాడుతూ, "శ్యామా! ఈ సారి నువ్వు "ఆశీర్వాదాలతో నే" స్వాగత మిస్తావనుకున్న నాకు ఆనందంతో స్వాగత మిచ్చావు. అందుకే భక్తుడు సమర్పించే చిన్న కానుకను స్వీకరించు" అంటూ జాజుల నెక్లెస్ తీసి తనమెడలో స్వయంగా పెడుతూంటే తను ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది.

పాడుమనస్సు, అంత ఆనందములోనూ 'నాకు శ్రావణపట్టీ తేలేదుసుమా' అని గోల పెడుతూనే వుంది.

తర్వాత వారు చెప్పారు. మొదట శ్రావణపటీకోసమే ఆ నెక్లెస్ చేయించారుట. ఏం తమకొడుక్కు ఆషాఢపట్టీ పంపనప్పుడు శ్రావణపట్టీ పంపేదేమిటని అత్తగారు భీష్మించుకు కూర్చున్నారుట. చివరకు ఏమనుకున్నారో ఏమో; కొడుకు బయల్దేరి వస్తూంటె "దానికోసం చేయించిన వస్తువు నాకెందుకూ? తీసికెళ్ళియియ్యి, ఎవరిమాట వారికే వుంటుంది" అన్నారుట అత్తగారు.

ఏమైతేనేమి తనుకోరిన వస్తువు లభ్యమయినా, శ్రావణపట్టీ తనకు తీరలేదనే కొరత కొరతగానే మిగిలిపోయింది ఈ నాటికీ. ఇంతసేపూ ఆలోచనలతో ప్రొద్దుకూకపెట్టేకానే, వాళ్ళ యిందిరకు శ్రావణపట్టీ ఏమి తెచ్చారో చూసిరావాలి అనుకుంటూ బయలుదేరింది శ్యామల. ★


సాటిలేని ఆల్-వేవ్ రేడియో

# నేషనల్-ఎక్కో మోడలు ఎ-317

నేషనల్-ఎక్కో మోడలు ఎ-317 ఉత్తమ తరగతికి చెందిన ఒక ఘనమైన రేడియో. అది చక్కగా ఏళ్లతరబడి పనిచేస్తుంది. దానిని మీ దగ్గరలోనున్న నేషనల్-ఎక్కో వ్యాపారివద్ద నేడే వినండి. ఈ రేడియోతో ఒక సంవత్సరము గ్యారంటీ యివ్వబడుతుంది!

7 వాల్వుల, 8 బ్యాండుల ఎసి సెట్ వాల్‌నట్ ఫినిష్ యివ్వబడిన కఱ్ఱ క్యాబినెట్ ట్యూన్డ్ ఆర్.ఎఫ్ స్టేజ్. రు 595/-నెట్




నేషనల్-ఎక్కో రేడియోలు శ్రేష్ఠమైనవి—

అవి మాన్‌సూనైజ్ చేయబడినవి

జెనరల్ రేడియో & అప్లయన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్

ఒపెరా హౌస్, బొంబాయి 4 • 3 మదన్ స్ట్రీట్, కలకత్తా 13
1/18 మౌంట్ రోడ్, మద్రాసు • 36/79 సిల్వర్ జూబ్లీ పార్క్ రోడ్, బెంగుళూరు • ఫోగ్ధియాన్ కాలనీ, చాందినీ చౌక్, ఢిల్లీ

GRA 6698